క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి

ప్రొద్దుటూరు : వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని శుక్రవారం గుంతకల్‌లో జరిగిన డివిజనల్ రైల్వే మీటింగ్‌లో చర్చించినట్లు డివిజనల్ రైల్వే బోర్డు మెంబర్ షామీర్ బాషా తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ మనీష్ అగర్వాల్‌కు ఈ మేరకు ఆయన వినతి పత్రం సమర్పించారు. పట్టణానికి రైల్వే స్టేషన్ 4 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున పట్టణంలో వైటీఎస్‌కే కావాలని కోరారు. రిజర్వేషన్ కోసం కమర్షియల్ క్లర్క్‌ను ప్రత్యేకంగా నియమించాలని, ప్యాసింజర్ అనౌన్స్‌మెంట్ అమలు చేయాలని కోరామన్నారు. అరక్కోణం – కడప రైలును ప్రొద్దుటూరు వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు.

నేడు అవగాహన సదస్సు

బద్వేలు అర్బన్ : స్థానిక రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 9 గంటలకు రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ విభాగం, ఎయిర్‌ఫోర్స్ ఆర్మీ అధికారుల ఆధ్వర్యంలో ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హైదరాబాద్ నుంచి ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు రాజేష్, వారి బృందం హాజరవుతారన్నారు. 17 సంవత్సరాలకు పైబడి ఆసక్తి కలిగిన యువతీయువకులు, డిగ్రీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కంపచెట్లను తొలగించండి



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

కాశినాయన : మండలంలోని బసనపల్లె నుంచి బాలరాజుపల్లె తారురోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని మోడల్ పాఠశాల విద్యార్థులు అధికారులను కోరుతున్నారు. పాఠశాలకు సైకిళ్ల మీద దాదాపు 100 మంది విద్యార్థులు ఈ రహదారి వెంబడి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇదే మార్గంలో మండల కేంద్రానికి ద్విచక్ర వాహనాలపై ప్రజలు వెళుతుంటారని, మార్గమధ్యలో ఎదురుగా వాహనాలు కనిపించక కిందపడి దెబ్బలు తగిన సంఘటనలు ఉన్నాయని విద్యార్థులు వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని వారు కోరారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లుల వసూలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ చార్జీల వసూళ్ల కేంద్రాల్లో కౌంటర్లు యథావిధిగా శని, ఆదివారాల్లో పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : జూనియర్ ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక శ్రీనివాస నగర్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు నియోజక వర్గంలో ఎంపీసీలో 430, బైపీసీలో 400, ఎంఈసీలో 470, సీఈసీలో 450 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి విద్యార్థికి నగదు ప్రోత్సాహక బహుమతి, సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కులిస్టు, ఆధార్ కార్డులను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9248722218 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గొలుసు చోరీ

మైదుకూరు : కూరగాయలు కావాలంటూ బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కూరగాయలు అమ్మే మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం రాత్రి మైదుకూరులో జరిగింది. స్థానిక వనిపెంట రోడ్డులో అంకాలమ్మ గుడి వద్ద ఉన్న కూరగాయలు అమ్మే మహిళ వద్దకు ఇద్దరు యువకులు వచ్చారు. కూరగాయలు కావాలని అడిగారు. ఆమె వారు కోరిన కూరగాయలను తూకం వేస్తుండగా ఆమె మెడలోని గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మైదుకూరు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : సికింద్రాబాద్‌లోని ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో శిక్షణ పొందిన ఎన్‌సీసీ విద్యార్థులను ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి మహేష్ అభినందించారు. ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు 10 రోజులపాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో కళాశాలకు చెందిన పవన్, అరుణ్, సమీర్, విష్ణువర్ధన్, ఓంకార్‌లు పాల్గొన్నారు. వారు వివిధ రకాల ఆయుధాలు ఉపయోగించడంపై శిక్షణ పొందారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



సచివాలయ నూతన భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. సీసీ రోడ్లు వేయాలని, ఇంటి స్థలాలు, పింఛన్లు ఇవ్వాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు.

సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం

కృష్ణంపల్లెలో రూ.82లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర సర్వే పూర్తయిన వెంటనే అన్ని సచివాలయాల్లో భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. ప్రస్తుతానికి 13 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2014లో రైతుల రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు రైతులను నట్టేట ముంచారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల వారే బాగుపడ్డారని, ప్రజలెవరికీ మేలు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ మేరువ నాగులు, ఎంపీటీసీ షేక్ ఇమాంబీ, తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఏఓ అమరనాథ్‌రెడ్డి, డాక్టర్లు సురేష్ బాబు, రోషిణి, నాయకులు ఓబుళరెడ్డి, విజయ్, ఎల్లారెడ్డి, చిన్న మాబుసా, మాబాషా, నరసింహులు, వెంకటసుబ్బారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

చాపాడు : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని ఓబుళరెడ్డిపేటలో శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ముదిరెడ్డి ఓబుళరెడ్డి, పాలగిరి వేమారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాల మంజూరు, స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, సర్పంచ్ రాజేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సుబాని, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ గంగులయ్య, పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రస్తుత వర్షాకాలంలో పట్టణంలో ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పట్టణంలోని చాలా వార్డుల్లో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయని, విద్యుత్‌శాఖకు త్రీ ఫేస్ లైన్ కోసం డబ్బులు చెల్లించినా పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. అలాగే బద్వేలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు రోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 32వ వార్డులో సీసీ రోడ్డు పనులతోపాటు డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆ వార్డు కౌన్సిలర్ చెన్నయ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 24వ వార్డులో వీధిదీపాల సమస్య, డ్రైనేజీ సమస్య ఉందని అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా స్పందించడం లేదని కౌన్సిలర్ రవితేజ సమావేశం దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. 10వ వార్డులోని కొండారెడ్డివీధిలో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు. 3వ వార్డులో బృహత్తర తాగునీటి పథకం పైపులైను పూర్తిస్థాయిలో లేదని, తక్షణమే పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ వార్డు కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య కోరారు. అలాగే 4వ వార్డులోని శ్మశానవాటికతోపాటు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయని, వాటిని తొలగించాలని ఆ వార్డు కౌన్సిలర్ రామచంద్రారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను చైర్మన్ ఆదేశించారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు వెలుగులు

- సొంత డబ్బుతో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎల్‌ఈడీ లైట్లను చూపుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలోని మహనీయులతోపాటు జాతికి సేవ చేసిన మహోన్నత వ్యక్తుల విగ్రహాలకు సొంత డబ్బుతో సోలార్ ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాచమల్లు రాజన్న భోజన శాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైరా నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పుట్టపర్తి నారాయణాచార్యులు, పూలే, శ్రీకృష్ణదేవరాయులు, పొట్టి శ్రీరాములు, సుభాష్‌చంద్రబోస్, వాల్మీకి, రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్, డాక్టర్ ప్రసాదరెడ్డితోపాటు 20కిపైగా విగ్రహాలు ఉన్నాయన్నారు. పట్టణమంతా రోజూ కాంతివంతంగా కనిపిస్తుండగా విగ్రహాలు మాత్రం చీకటిలో ఉన్నాయన్నారు. అందువల్ల విగ్రహాలకు సోలార్ ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో విగ్రహానికి రూ.25వేల చొప్పున తన సొంత డబ్బు చెల్లించానని, ఇప్పటి వరకు పది సెట్ల ఎల్‌ఈడీ లైట్లు వచ్చాయని, మిగతావి కూడా త్వరలో తెప్పిస్తామన్నారు. జాతి కోసం పోరాటం చేసిన మహనీయులు, త్యాగధనులను పది కాలాలపాటు స్మరించుకుని భావితరాల వారికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సాయికృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, కమాల్, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే డ్వాక్రా మహిళలకు లబ్ధి



శిక్షణలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : డ్వాక్రా గ్రూపులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఎంతో మేలు చేశారని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి చెప్పారు. శుక్రవారం స్త్రీ శక్తి భవన్‌లో ఏపీడీ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమాఖ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో గ్రూపులకు లక్షా, రెండు లక్షల రూపాయలే ఇచ్చేవారని, వైఎస్ జగన్ వచ్చాక రూ.20 లక్షల వరకు ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు డ్వాక్రా గ్రూపుల బకాయిలు చెల్లిస్తానని చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఇప్పుడు వరకు మూడు విడతల్లో నిధులు విడుదల చేశారన్నారు. 2014లో చంద్రబాబు డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. 2024లో జగన్ ముఖ్యమంత్రిగా ఉంటేనే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రమౌళి, వీఏఓలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పోరుమామిళ్ల : మణిపూర్‌లో మతోన్మాద శక్తులు చెలరేగి అమాయక మహిళలను నగ్నంగా నడిరోడ్డుపై ఊరేగించి, చిత్రహింసలు పెట్టడం, ప్రజలను కొట్టడం దారుణమని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండువద్ద సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు మణిపూర్ సంఘటనలకు నిరసనగా కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ ఆరునెలలుగా మండుతూనే ఉందన్నారు. ఈ దేశాన్ని వల్లకాడు చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. భూతల స్వర్గంగా ఉన్న ఈశాన్యరాష్ట్రాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కేశవ, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, శ్రీనివాసులు, విశ్వాసమ్మ, గురమ్మ, నరసింహులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



డ్వాక్రా అధికారులు, బ్యాంకు మేనేజరుతో మండల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

చాపాడు : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్త్రీ శక్తి భవనం వద్ద శుక్రవారం ఇందిరా క్రాంతి పథం ఏపీఎం వెంకటరమణ అధ్యక్షతన మండల సమాఖ్య మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన యూనియన్ బ్యాంకు మేనేజర్ మహిళలనుద్దేశించి మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం, బ్యాంకులు అందించే వివిధ రకాల రుణాలు తీసుకుని వాటి ద్వారా ఆర్థిక అభివృద్ధి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ నాగేంద్ర బాబు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మరియమ్మ..

చాపాడు మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పల్లవోలు గ్రామానికి చెందిన మరియమ్మ నియమితులయ్యారు. మండల సమాఖ్య మహాసభలో శుక్రవారం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని మహిళా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మరియమ్మ, ఉపాధ్యక్షులుగా నాగలక్ష్మి, కార్యదర్శిగా వెంకటసుబ్బమ్మ(చియ్యపాడు), కోశాధికారిగా జీవన(కేతవరం), ఉప కార్యదర్శిగా నాగేశ్వరమ్మ నియమితులయ్యారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్రం తీరుపై సీపీఐ నిరసన



కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రొద్దుటూరు : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వేల ఎకరాలు కేటాయించారన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి ఆ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రూపాయలను ఆర్జించారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉందని, అయితే పార్లమెంట్‌లో కేంద్ర పారిశ్రామిక మంత్రి నిత్యానందరాయ్ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నిత్యానందరాయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకుని భగ్నం చేశారు. సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు హరి, యేసోబ్, శ్రీను, దౌలా, రవిచంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరవు భత్యం, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం తమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం మూడు డీఏలను ప్రకటించగా రాష్ట్ర ప్రభుత్వ కేవలం ఒక డీఏ మాత్రమే ప్రకటించిందన్నారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, మునివర్ధన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజుగా చేసిన సీఎం జగన్

రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతును రాజుగా చేశారని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం దండగ అని నిర్లక్ష్యం చేశారన్నారు. అదే వ్యవసాయాన్ని నాడు సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పండుగలా మార్చారన్నారు. పాలకులు బాగుంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి నిదర్శనం సీఎం జగన్ అన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల, దేశాల ప్రతినిధులు సైతం సచివాలయ వ్యవస్థను చూసి ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. దీన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కనీసం 35 మండలాలను ప్రతి ఏటా కరువు మండలాలుగా ప్రకటించడం, రైతులకు కరువు భత్యం ఇవ్వకుండా ఎగ్గొట్టడం జరిగిందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క ఏడాది కూడా కరువు పరిస్థితులు నెలకొనలేదన్నారు. 2012–13 పంటల బీమా, 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పంటల బీమాను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెల్లించిందని తెలిపారు. దేశంలో ఎక్కడా పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించలేదని, మన రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. పంట నష్టపరిహారం కూడా నెల రోజుల్లోపే ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

చక్రాయపేట : శ్రీ గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీవరకు జరిగే శ్రావణ మాసం ఉత్సవాలకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని శుక్రవారం టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని గండిక్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి కలిసి కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు టీటీడీ దేవస్థాన ఖర్చుతో షెడ్లు, స్టేజీ, మొబైల్ టాయిలెట్స్, 70 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. స్పందించిన టీటీడీ ఈఓ సంబంధిత అధికారులను పిలిపించి సత్వర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారని గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

బద్వేలును సుందరంగా తీర్చిదిద్దుతాం

- రూ.1.40 కోట్లతో నాగులచెరువు సుందరీకరణ పనులకు భూమిపూజ
- పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



నాగులచెరువు సుందరీకరణ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. పట్టణంలోని నాగులచెరువు సుందరీకరణ కోసం అమృత్–2 పథకంలో భాగంగా మొదటి విడతలో మంజూరు చేసిన రూ.1.40 కోట్లతో చేపట్టనున్న పనులకు శుక్రవారం వారు భూమిపూజ చేసి మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన నాగులచెరువు కబ్జాలకు గురికావడంతోపాటు వ్యర్థాలతో నిండుకుని దుర్గంధభరితంగా మారిన నేపథ్యంలో స్థానిక నాయకుల సూచన మేరకు నిధులు మంజూరు చేయించి సుందరీకరణ చేసేందుకు కృషి చేశామన్నారు. మొదటి విడతలో చేపట్టనున్న సుందరీకరణ పనులలో చెరువు చుట్టూ రింగ్ బండ్, 900 మీటర్ల వాకింగ్ ట్రాక్, గ్రీనరీతోపాటు చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయన్నారు. అలాగే ఇదే పథకం కింద ఫేస్–2లో మరో రూ.2 కోట్ల నిధులకు డీపీఆర్ సిద్ధమైందని, త్వరలోనే టెండర్లు పిలవనున్నారని, ఆ పనులను కూడా వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా సేదతీరడానికి నాగులచెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆడా చైర్మన్ గురుమోహన్, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు శివయ్య, బిజ్జం రమణ, అనిల్, నాగేశ్వర్‌రావు, బాబు, కుప్పాల రమణ, మౌలాలి, షఫీ, వెంకటేశ్వర్లు, భార్గవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతం.. అర్హులకు సంక్షేమం

అట్లూరు : పార్టీలతో సంబంధం లేకుండా మన ముఖ్యమంత్రి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధ పేర్కొన్నారు. శుక్రవారం కమలకూరు సచివాలయ పరిధిలో ఉన్న కమలకూరు, కమలకూరు బీసీ కాలనీలలో మండల జేసీఎస్ కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు ఏఏ పథకం ద్వారా ఎంతమేర లబ్ధి పొందినది బుక్‌లెట్ అందించి వివరించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అందరికీ మంచి చేస్తున్న మన సీఎం జగనన్నకు మరో మారు అవకాశం ఇస్తే రాష్ట్రంలో పేదరికం ఉండదని తెలిపారు. డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజోలు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, ఈశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, గంగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వెంకట్‌కు చిరంజీవి ప్రశంసలు



చిరంజీవితో వెంకట్, తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణ

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసల జల్లు కురిపించారు. చిరంజీవి ఆహ్వానం మేరకు ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీకి చెందిన వెంకట్ తల్లిదండ్రులతో కలసి శుక్రవారం హైదరాబాద్‌లోని చిరంజీవి వెంటికి వెళ్లారు. తమ కుమారుడి ప్రతిభ గురించి విశాలాక్షి, రాధాకృష్ణ దంపతులు చిరంజీవికి వివరించారు. తన పాటలు, డైలాగులు, లిప్ రీడింగ్‌తో వెంకట్ చిరంజీవిని అబ్బురపరిచాడు. ఇన్ని సమస్యలున్నా ఆత్మస్థైర్యం, పట్టుదలతో వెంకట్‌ను అసాధారణ ప్రతిభావంతునిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను మెగాస్టార్ అభినందించారు. వెంకట్ బయోపిక్ తీయడానికి స్క్రిప్ట్ సిద్ధం చేశామని, కొణిదెల ప్రొడక్షన్‌లో సినిమా తీయాలని వారు చిరంజీవిని కోరారు.

ఎంప్లాయీస్ కాలనీకి రోడ్డు నిర్మించాలి



గోపవరం ఎంప్లాయిస్ కాలనీలోని రోడ్డు

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ ఎంప్లాయిస్ కాలనీకి వెళ్లే దారిలో గుంతలుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో ఎక్కువగా రిటైర్డు ఉద్యోగులు నివసిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్పందించి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయించారని, అలాగే కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పించి డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అబేట్ ద్రావణాన్ని చల్లిస్తున్న వైద్యాధికారి

బి.కోడూరు : బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని 10 సచివాలయాల్లోని గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బి.కోడూరులో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు పాల్గొని గ్రామంలోని అపరిశుభ్ర ప్రదేశాలు, మురికినీరు నిల్వ ఉన్న గుంతలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్న మురికి గుంతలలో అబేట్ ద్రావణం పిచికారీ చేయాలని పారిశుధ్య సిబ్బందికి తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



గ్రామంలో ఊరేగుతున్న పీర్లు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో ఘనంగా మొహర్రం వేడుకలు జరుగుతున్నాయి. కులమతాలకతీతంగా జరుగుతున్న ఈ వేడుకల్లో శుక్రవారం పెద్దసరిగెత్తు సందర్భంగా పీర్లచావడి వద్ద హిందూ, ముస్లింలు కలిసి పీర్లకు చదివింపులు చేశారు. అనంతరం పీర్లచావడి ఎదుట గుండం ఏర్పాటు చేసి శనివారం తెల్లవారుజామున గుండం ప్రవేశం చేయనున్నారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగిస్తారు. సాయంత్రం పీర్లను బావికి తరలించడంతో మొహర్రం వేడుకలు పూర్తవుతాయి.